సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

సోమవారం ၊ 2 ၊ డిసెంబర్ ၊ 2024



అవని మెచ్చిన గణితావధాని

పుట్టు అంధుడైనా డాక్టర్ లక్కోజు సంజీవ రాయశర్మ గణితంలో అవధానం చేయడంలో మేధావి. దేశ వ్యాప్తంగా 6 వేల దాకా ప్రదర్శనలు ఇచ్చి అందరి మన్ననలు పొందారు. -8లో



గండికోటలో భద్రత డొల్ల!

గండికోటలో పర్యాటకులకు, వారి వాహనాలకు భద్రత కరువైంది. టోల్‌గేట్ పేరిట డబ్బులు వసూలు చేస్తున్నా వాహనాలకు భద్రత లేకుండా పోయింది. -8లో

గరిష్టం/కనిష్టం
26.5 /20.2

వాతావరణం

జిల్లాలో ఆదివారం 20.2 - 26.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 0.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేటి గ్రీవెన్స్‌సెల్ రద్దు

కడప సెవెన్‌రోడ్స్: కడప కలెక్టర్ కార్యాలయంలో ఈ సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌సెల్) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తుపాను కారణంగా సోమవారం జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశమున్నందున ప్రజల నుంచి వినతులు స్వీకరించే కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేశామని ఆయన పేర్కొన్నారు. కావున జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని వివరించారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఫొటో, వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేరింగ్, సర్వీసింగ్, రెఫ్రిజిరేషన్, ఎయిర్ కండీషన్‌లో ఈ నెల 19 నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని ఆ సంస్థ డైరెక్టర్ ఆరీఫ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18–45 ఏళ్ల మధ్య వయసు కలిగిన నిరుద్యోగులు అర్హులని ఆయన పేర్కొన్నారు. దూర ప్రాంతాల వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు: 94409 05478, 99856 06866లలో సంప్రదించాలని వివరించారు.

జాతీయ జట్టు ఎంపికల్లో చోటు



అరుణ

కడప స్పోర్ట్స్: జాతీయ స్థాయి అండర్–20 మహిళల ఫుట్‌బాల్ జట్టు ఎంపికల్లో వైఎస్ఆర్ జిల్లాకు చెందిన టి.అరుణ చోటు దక్కించుకుంది. ఈ పోటీలు ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (ఏఐఎఫ్ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ నెల 10న బెంగళూరులో తుది జట్టు ఎంపికలు నిర్వహిస్తారు. మహిళా ఫుట్‌బాల్ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.డానియల్ ప్రదీప్ తెలిపారు.

చైతన్యంతోనే ఎయిడ్స్ నివారణ



ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ నాగరాజు

కడప రూరల్: ప్రజా చైతన్యంతోనే ఎయిడ్స్‌ను నివారించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినం నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి రవిబాబు జిల్లాలో హెచ్ఐవీ నియంత్రణ కోసం చేపట్టే కార్యక్రమాలను వివరించారు. అనంతరం జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన వారికి మెమొంటో, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అంతకుముందు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డీఎంహెచ్ఓ ప్రారంభించారు. హెచ్ఐవీ నివారణకు ప్రతిజ్ఞ చేశారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఉమామహేశ్వరకుమార్, బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ రాజేంద్ర, సూపర్‌వైజర్ పీవీ ప్రసాద్, దిశా టీమ్ సాధిక్, సిలార్, అఫ్రోజ్, జిల్లాలోని నర్సింగ్ కళాశాలలు, ఎన్‌వైకే, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, కడప సర్వజన ఆస్పత్రి ఐసీటీసీ మెడికల్ ఆఫీసర్లు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చివరిలో చినుకు భయం



నా పేరు పండిటి నారాయణ. మాది చాపాడు మండలం చిన్నవరదాయపల్లి గ్రామం. నాకు ఉన్న సొంత పొలం 4 ఎకరాలతోపాటు మరో 4 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి పంట సాగు చేశాను. తుపాను కారణంగా వరి కోత నిలిపేశాను. ఇప్పుడేమో గాలులతో కూడిన వర్ష పడుతోంది. ధరలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఏమి గిట్టుబాటు అవుతుందో ఏమో భయంగా ఉంది.

☛ ఇదీ ఈ ఒక్క రైతు బాధే కాదు. వరి సాగు చేసిన వారందరూ ఇలాంటి పరిస్థితి ఎదుర్కొంటున్నారు.

- ఫెంగల్ తుపానుతో ఈదురు గాలుల వర్షం
- తగ్గినట్టే తగ్గి మళ్లీ ప్రారంభమైన వైనం
- పలు చోట్ల నేలవాలిన పంట
- కొన్ని ప్రాంతాల్లో కోతలు మొదలు
- అన్నదాతల్లో ఆందోళన



మైదుకూరు ప్రాంతంలో కోతకు సిద్ధగా ఉన్న వరి పైరు

కడప అగ్రికల్చర్: ఫెంగల్ తుపాను ఖరీఫ్ రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. వాయుగుండం తుపానుగా బలపడటంతో శనివారం రాత్రి నుంచి జిల్లాలో ఈదురు గాలులతో కూడిన జల్లుల వర్షం కురవడం ప్రారంభమైంది. దీంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. వాయుగుండం తుపాను మారవచ్చని నాలుగైదు రోజుల క్రితమే వాతావరణ శాఖ హెచ్చరించింది. అయితే మధ్యలో రెండు రోజులు కాసింత తెరపిచ్చి కమ్ముకుంది. మళ్లీ ఆకాశమంతా కారుమబ్బులతో నిండి వర్షం ఆరంభమైంది. రెండు రోజులు ఇచ్చిన తెరపతో రైతులు ఇక వర్షం రాదనుకుని.. అక్కడక్కడా వరి కోతలు ప్రారంభించారు. ఉన్నట్టుండి మళ్లీ వర్షాలు కురుస్తుండటంతో రైతన్నల్లో అలజడి మొదలైంది. కొంత మంది వరి ధాన్యాన్ని రోడ్లపైన, మెట్టప్రాంతాల్లో ఆరబెట్టుకుంటున్నారు. అప్పుడప్పుడు వర్షం పడటం, మళ్లీ కొద్దిసేపు తెరప ఇస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పచ్చిధాన్యం కావడంతో పట్టల కింద అలాగే రెండు, మూడు రోజులు ఉంచితే ఉక్కతో దెబ్బతినే ప్రమాదం ఉంటుందని పలువురు వాపోతున్నారు. అలాగని పట్టలు తీసేద్దామంటే పెద్ద వర్షం వస్తుందేమోనన్న భయం వెంటాడుతోంది. ఈ రెండింటి మధ్య అన్నదాతలు మానసికంగా కుంగిపోతున్నారు.

కంకులకు మొలకలు వచ్చే అవకాశం

ప్రస్తుతం తుపాను కారణంగా గాలులు వీస్తున్నాయి. దీంతో పూర్తిగా కోతకు సిద్ధంగా ఉన్న వరి పలు చోట్ల నేలకొరుగుతోంది. వరి పంటలో అంతో ఇంతో నెమ్ము ఉంటుంది. పైగా ఈ వర్షం కారణంగా నేల మరింత నెమ్ము వచ్చే అవకాశం ఉండటంతో.. కింద పడిన కంకులకు మొలకలు వచ్చే అవకాశం ఉందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం చాపాడు, ప్రొద్దుటూరు, మైదుకూరు, ఖాజీపేట తోపాటు పలు మండలాల్లో వరి కోతలు ప్రారంభించారు. అయితే వర్షాలు కురుస్తుండటంతో చాలా మంది కోతలు వాయిదా వేశారు.



వరి సాధారణ సాగు విస్తీర్ణం: 31171 హెక్టార్లు


సాగైన పంట: 28428 హెక్టార్లు

ప్రాంతాలు: కుందూ, పెన్నా పరివాహకం, కేసీ కెనాల్ ఆయకట్టు

►► జిల్లాలో వర్షం

కడప అగ్రికల్చర్: ఫెంగల్ తుపాను కారణంగా జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. శనివారం తెల్లవారుజాము నుంచే ఆకాశమంతా మేఘావృతమై చిరుజల్లులతో కూడిన వాన ఆగి ఆగి పడింది. ఒంటిమిట్ట మండలంలో అత్యధికంగా 11.2 మిల్లీమీటర్లు, అట్లూరులో 6.4, సిద్దవటం 5.6, కడప 5.2, చింతకొమ్మదిన్నె 2.4, వేముల 2, పెండ్లిమర్రిలో 1.2 మి.మీ వర్షం నమోదైంది.

►► తాలుగింజ వస్తే తీవ్ర నష్టం



జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 28428 హెక్టార్లలో వరి పంట సాగైంది. ముఖ్యంగా పెన్నా, కుందూ నదుల పరీవాహక ప్రాంతాలైన చాపాడు, ప్రొద్దుటూరు, చెన్నూరు, కడప, సిద్దవటం, ఒంటిమిట్ట, మైలవరం మండలాల పరిధిలోని బోర్లు, ఫిల్టర్ల కింద ముందస్తుగా వరి సాగు చేశారు. వారు నెల రోజుల క్రితమే కోతలు కోశారు. కేసీ కెనాల్ తోపాటు మిగతా పలు మండలాల్లో ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వరి సాగు చేశారు. ఆగస్టులో వేసిన పంట ప్రస్తుతం కోత దశకు చేరుకుంది. మరో నాలుగైదు రోజుల్లో కోతలు మొదలు పెడదామనుకుంటున్న తరుణంలో.. తుపాను ముసురుకుంది. అలాగే సెప్టెంబర్‌లో సాగు చేసిన వరి కొన్ని చోట్ల చిరుపొట్ట దశలో ఉంది. వర్షపు నీరు కంకిలోకి వెళ్తే తాలుగింజ వచ్చే అవకాశం ఉంది. అలా జరిగితే తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

►► ధరల్లో కోత.. రైతులకు వాత



కోత కోసి ధాన్యం ఉంచుకున్న రైతు

వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా చిరుజల్లులతో కూడిన జడివాన కురుస్తుండంతో వరిధాన్య ధరల్లో దళారీలు కోత పెడుతున్నట్లు పలువురు రైతులు తెలిపారు. మొన్నటి వరకు పుట్టి(8 బస్తాలు) 14 వేల దాకా ధర పలికింది. ప్రస్తుతం రూ. 9500 నుంచి రూ.12 వేల వరకు అడుగుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షంతో ధాన్యానికి ముప్పేమోనని రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో దళారీలు చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది.

కింద పడిపోయే స్థితిలో ఉంది



నేను 1.5 ఎకరాల్లో వరి సాగు చేశాను. తుపానుతో గాలులతో కూడిన వర్షం కురుస్తోంది. పంట కింద పడిపోయే పరిస్థితి నెలకొంది. కింద పడిపోతే మిషన్‌తో కూడా కోయడం కష్టం అవుతుంది. పడిపోతే బెల్ట్‌మిషన్‌తో కోయాల్సి వస్తుంది. అప్పుడు ఖర్చు భారీగా పెరుగుతుంది.

– ఏటూరు సుధాకర్, చెంచుపల్లి, ప్రొద్దుటూరు

కోతలు ఆపాను



వారం క్రితమే వరి కోతను కోసుకోవాల్సి ఉంది. అయితే తుపాను అని చెబుతుండటంతో 3 ఎకరాల్లో వరికోతను ఆపేసుకున్నాను. ఈ వర్షం ఎప్పుడు తగ్గుతుందో నేను ఎప్పుడు వరికోత కోసుకోవాలో అర్థం కావడం లేదు. వర్షం తగ్గగానే కోత కోసుకోవాలి. లేకుంటే బెండగిల్లి పడిపోతుంది.

– రవికుమార్, చిన్న వరదాయపల్లి, చాపాడు

కొలిక్కి వచ్చిన ఎస్పీ నియామకం

తెరపైకి గుంతకల్లు రైల్వే ఎస్పీ రాహుల్ మీనా పేరు



రాహుల్ మీనా

కడప అర్బన్: వైఎస్ఆర్ జిల్లా ఎస్పీ నియామకం కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. నేడో, రేపో ఉత్తర్వులు రావచ్చునని సమాచారం. రాజకీయ నేతల ఒత్తిడితో ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు మూడు వారాల క్రితం బదిలీ అయిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఇక్కడ ఇన్‌చార్జి ఎస్పీగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో పూర్తి స్థాయి ఎస్పీని నియమించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఎస్పీగా ప్రస్తుతం గుంతకల్లు రైల్వే డివిజన్ ఎస్పీగా పని చేస్తున్న రాహుల్ మీనాను నియమించారని, ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు అధికారికంగా విడుదల చేయనున్నారని విశ్వసనీయ సమాచారం. అలాగే గతంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోగా పని చేసి, ఎస్పీగా ఇటీవల పదోన్నతి పొందిన చక్రవర్తి, గతంలో కడపలో డీఎస్పీగా పని చేసి ఎస్పీగా పదోన్నతి పొందిన ఈజీ అశోక్‌కుమార్ గౌడ్, ఇంకా కొందరి పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. తమకు అనుకూలంగా పని చేసే అధికారిని నియమించుకుంటే మేలని అధికార పార్టీకి చెందిన నేతలు అధిష్టానం వద్ద పావులు కదుపుతున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఎవరిని నియమిస్తారోనని పోలీసు యంత్రాంగం, ప్రజలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

భగవద్గీత పోటీలకు విశేష స్పందన

రాజంపేట టౌన్: పట్టణంలోని మన్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలకు విశేష స్పందన లభించింది. ఈనెల 11వ తేదీ గీతాజయంతిని పురస్కరించుకొని తిరుమల–తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్తు అన్నమయ్య జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఈపోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. 6,7 తరగతుల విభాగంలో రాజంపేట బాలికల హైస్కూల్‌కు చెందిన శ్రావణి, అక్షరస్కూల్‌కు చెందిన సాయియోషిత, రాజుహైస్కూల్‌కు చెందిన సాహితీ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుపొందారు. 8, 9, 10వ తరగతుల విభాగంలో ధర్మనిధి, శివపార్వతి, పి.అన్వితలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందారు. సంపూర్ణ భగవద్గీత పోటీల్లో రాయచోటికి చెందిన అన్విత, మదనపల్లెకు చెందిన ధన్విక ప్రథమ, ద్వితీయ బహుమతులు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ గోపిబాబు తదితరులు పాల్గొన్నారు.

కమనీయంగా అయ్యప్పస్వామి లక్షార్చన



అయ్యప్పస్వామికి పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు



లక్షార్చన చేస్తున్న దీక్షదారులు

- పాల్గొన్న 2 వేల మందికి పైగా దీక్షదారులు
- 35 వేల మంది భక్తులకు అన్నప్రసాదం

ప్రొద్దుటూరు కల్చరల్: పట్టణ శివారు ప్రాంతమైన పెన్నా నది తీరంలోని శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం లక్షార్చన మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి ఉత్సవమూర్తికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. గణపతి, సుబ్రహ్మణ్యం, అయ్యప్ప, వెంకటేశ్వర హోమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా చేపట్టి పూర్ణాహుతి సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా రూపొందించిన సెట్టింగ్‌లో గణపతి, అయ్యప్పస్వామి, లక్ష్మీదేవి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. సుమారు 2 వేల మంది అయ్యప్ప స్వామి దీక్షదారులు పాల్గొన్నారు. పసుపు, కుంకుమ, పూలు, భస్మం, పూజా ద్రవ్యాలతో లక్షసార్లు స్వామివారిని మనసారా అర్చించి శరణు వేడారు. అయ్యప్పస్వామి మూల విరాట్‌కు భస్మాభిషేకం, గంధాభిషేకం, నెయ్యాభిషేకం, కుంకుమాభిషేకం, గో క్షీరాభిషేకం వంటి అభిషేకాలు చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. దీక్షదారులు కలశాన్ని అయ్యప్ప నామ స్మరణల మధ్య ఊరేగించారు. కలశంలోని పూజా ద్రవ్యాలతో స్వామివారిని అభిషేకించారు. అమృతేశ్వరస్వామికి, ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తి పీఠాలకు ప్రత్యేక పూజలతో పాటు అలంకరణ చేశారు. దాదాపు 35 వేల మంది భక్తులకు స్వామి అయ్యప్ప సేవా సంఘం వారు అన్నప్రసాదాన్ని అందించారు. 45 వేల మందిపైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆర్‌సీపీఈ, ఆర్‌టీడీ, దీక్షదారులు, వలంటీర్లు దాదాపు 500 మందికిపైగా సేవలందించారు. పుర ప్రముఖులతో పాటు అధికారులు, ప్రజలు స్వామివారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. స్వామి అయ్యప్ప సేవాసంఘం అధ్యక్షుడు కొవ్వూరు రమేష్‌రెడ్డి ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందించి శాలువ కప్పి సత్కరించారు. టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు టంగుటూరి మారుతి ప్రసాద్, స్వామి అయ్యప్ప సేవాసంఘం వైస్ ప్రెసిడెంట్ నారాయణ, కార్యదర్శి సతీష్, ట్రెజరర్ టంగుటూరి వినోద్‌కుమార్, పీఆర్‌ఓ ధారా సంంతోష్ అయ్యప్ప స్వామి, అమృతేశ్వరస్వామి ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విజయవంతంగా ముగిసిన పోలీస్ క్రీడలు

- ఓవరాల్ చాంపియన్‌గా కడప జట్టు
- వ్యక్తిగత విభాగంలో ట్రాఫిక్ కానిస్టేబుల్
- విజేతలకు బహుమతులు ప్రదానం



స్పూన్ ఆటలో మహిళా పోలీస్ సిబ్బంది



కడప సబ్‌డివిజన్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న పోలీసు అధికారులు



ట్రోఫీ అందుకుంటున్న కానిస్టేబుల్ సతీష్‌బాబు

కడప అర్బన్: కడప నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన పోలీస్ వార్షిక గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ఆదివారం సాయంత్రం ముగిసింది. మూడు రోజుల పాటు నిర్వహించిన క్రీడా పోటీల్లో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగింపు వేడుకలకు జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫైనల్ మ్యాచ్‌లను ఆయన ఆసక్తిగా తిలకించారు. అనంతరం పోలీస్ సబ్ డివిజన్లు కడప, ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందుల, ఆర్మ్‌డ్ రిజర్వ్ నుంచి పాల్గొన్న పోలీసు క్రీడాకారులు ముగింపు మార్చ్ ఫాస్ట్ చేసి అదనపు ఎస్పీకి గౌరవ వందనం చేశారు. పోలీస్ స్పోర్ట్స్‌మీట్‌లో వ్యక్తిగత చాంపియన్‌గా ట్రాఫిక్ పీఎస్ కానిస్టేబుల్ ఎల్.సతీష్‌బాబు (పి.సి.3322) నిలిచారు. ఓవరాల్ చాంపియన్‌గా కడప సబ్ డివిజన్ జట్టు నిలిచింది. స్పోర్ట్స్‌మీట్‌లో విజేతలుగా నిలిచిన జట్లకు, డీపీఓ సిబ్బంది, ఔట్‌సోర్సింగ్, క్లాస్‌ఫోర్ ఉద్యోగుల విభాగాల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి అదనపు ఎస్పీ ట్రోఫీలు, మెడల్స్, మెమెంటోలు, సర్టిఫికెట్స్ అందజేశారు. అనంతరం స్పోర్ట్స్‌మీట్‌కు ప్రతీకగా సూచించే పోలీస్ పతకాన్ని అదనపు ఎస్పీకి క్రీడాకారులు అందించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2024 పండుగ వాతావరణంలో కొనసాగిందని సంతోషం వ్యక్తం చేశారు. ఏఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య మాట్లాడుతూ కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, షాట్ పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, అథ్లెటిక్స్‌లో 100 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్ల పరుగుపందెం, హైజంప్, లాంగ్‌జంప్, క్రికెట్, షటిల్, బ్యాడ్మింటన్, టగ్ ఆఫ్ వార్ మొదలగు క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని అభినందించారు. విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన పోలీసు అధికారులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌లు, పోలీసు సిబ్బందికి మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కడప డీఎస్పీ ఎ.వెంకటేశ్వర్లు, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, పులివెందుల డీఎస్పీ మురళీనాయక్, ప్రొద్దుటూరు డీఎస్పీ భక్తవత్సలం, జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు, మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, మహిళా పీఎస్ డీఎస్పీ రమాకాంత్, డీపీఓ ఏఓ జ్యోతి, ఆర్ఐలు ఆనంద్, వీరేష్, టైటస్, శివరాముడు, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కడపలో చైన్ స్నాచింగ్

కడప అర్బన్ : కడప నగరంలోని ప్రకాష్ నగర్‌లో ఓ వృద్ధురాలి మెడలోని గొలుసును గుర్తు తెలియని దొంగలు లాక్కెళ్లారు. పింఛన్ ఇప్పిస్తామంటూ ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని మాటల్లో పెట్టి ఆమె మెడలోని రెండు తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. ఈ మేరకు చిన్నచౌక్ పోలీస్ స్టేషన్‌లో వృద్ధురాలి బంధువులు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

రైలులో నుంచి పడి యాచకుడికి గాయాలు

కొండాపురం : మండల పరిధిలోని చౌటిపల్లె–ఓబుళాపురం గ్రామాల మధ్య రైలులో నుంచి పడి గోవిందు(82) అనే యాచకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కు సమాచారం ఇవ్వడంతో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడికి కుడికాలు, కుడి చేయి విరిగినట్లు 108 సిబ్బంది తెలిపారు.

పోలీస్ స్టేషన్ ఆవరణలో కొండచిలువ కలకలం


ఎలుకను తింటున్న కొండచిలువ

కొండాపురం : కొండాపురం పోలీస్ స్టేషన్ ఆవరణంలో శనివారం రాత్రి కొండ చిలువ కనిపించడంతో స్థానికులు, పోలీస్ సిబ్బంది భయాందోళన చెందారు. ఎలుకను పట్టుకొని తినేందుకు ప్రయత్నిస్తున్న కొండచిలువను చూసి కుక్కలు అరవడంతో స్థానికులు పోలీస్ సిబ్బంది అప్రమత్తమై చూడగా కొండచిలువ కనిపించింది. కొండ ప్రాంతం కావడంతో ఎక్కువ విష పురుగులు సంచరిస్తున్నాయని స్థానికులు తెలిపారు. ఇటీవల వరుసగా నాలుగు సార్లు పాములు కనిపించాయని వారు పేర్కొన్నారు.

మిద్దెపై నుంచి పడి వ్యక్తి మృతి


మృతి చెందిన నాగేశం

కొండాపురం : స్థానిక మండలకేంద్రంలోని కుడుముల నాగేశం (53) ప్రమాదవశాత్తు మిద్దె పై నుంచి పడి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై కొండాపురం ఎస్ఐ విద్యాసాగర్ వివరాల మేరకు.. కొండాపురంలోని రామచంద్రనగర్‌లో నివాసం ఉంటున్న నాగేశం శనివారం రాత్రి మిద్దెపై నుంచి వస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని భార్య నాగేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కడప అర్బన్: కడప నగరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గౌస్‌నగర్‌లో నివాసం ఉంటున్న షేక్ అబ్దుల్ రసూల్ (45) అనే వ్యక్తి గతనెల 30న ఇంటిలో ఎలుకల మందు తిని ఆత్మహత్యకు యత్నించాడు. కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవాడు. ఇతనికి భార్య తబుస్సుమ్, ముగ్గురు పిల్లలున్నారు. బేల్దారిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఇతను మానసిక వేదనతో ఈ చర్యకు పాల్పడ్డాడు. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కడప టూటౌన్ ఎస్ఐ సిద్దయ్య కేసు నమోదు చేశారు.

అవని మెచ్చిన గణితావధాని

- గణిత బ్రహ్మ డాక్టర్ లక్కోజు సంజీవరాయశర్మ
- దేశ వ్యాప్తంగా 6వేలకుపైగా ప్రదర్శనలు
- నేడు వర్ధంతి

ప్రొద్దుటూరు కల్చరల్ : అన్నీ తెలిసిన వారే లెక్కల్లో తప్పులు చేస్తూ తడబడుతుంటారు. అలాంటిది గణితంలో ఎంత పెద్ద లెక్కలైనా అలవోకగా ఇట్టే చెప్పగలరు. పుట్టు అంధుడైనా లెక్కల గణనలో ఆయనకు సాటి మరెవరూ లేరు. ఎలాంటి సమస్యనైనా క్షణాల్లోనే పరిష్కరించే గణిత నైపుణ్యం అయనది. తెలుగుభాషలో అవధానం అంటే అందరికి తెలిసి ఉంటుంది. కానీ గణితంలో అవధానం చేయడం చాలా కష్టతరమైనది. అలాంటిది గణితంలో అవధానం చేసి అందరిని ఆశ్చర్యచికితులను చేసిన గొప్పవ్యక్తి గణితబ్రహ్మ డాక్టర్ లక్కోజు సంజీవరాయశర్మ. వేలాది మంది కూర్చున్న సభలో నిమిషానికి 20 నుంచి 30 కష్టమైన లెక్కలను అడిగిన వెంటనే వయోలిన్ వాయిస్తూ సమాధానం చెప్పే గొప్ప మేధస్సు ఆయనది. ఈ విద్య ఎలా నేర్చుకున్నావు అని ఎవరైనా అడిగితే దేవుడు ఇచ్చాడని చెప్పేవారు శర్మ.

లక్కోజు సంజీవరాయశర్మ నవంబర్ 22వ తేదీన 1907లో ప్రొద్దుటూరు మండలం కల్లూరు గ్రామంలో జన్మించారు. ఈయన పుట్టుకతో అంధుడు. ఈయనను బతికించడం కన్నా దిబ్బలో పూడ్చివేయండని వాళ్ల అమ్మకు ఆయన మేనత్త సలహా ఇచ్చిందట. బంధువులు ఉగ్గుగిన్నెలో వడ్లగింజలు వేసి పట్టించారట. అయినా ఆయన చనిపోలేదు. సంజీవరాయశర్మ హస్తరేఖలు చూసిన ఆయన తాత గొప్ప ప్రతిభావంతుడవుతాడు అని చెప్పడంతో ఆ ప్రయత్నాలను ఆపివేశారు.

విద్యాభ్యాసం..

అంధులకు ఉపయోగపడే బ్రెయిలీ లిపి ఆ రోజుల్లో లేకపోవడంతో సంజీవరాయశర్మ చదువుకోలేకపోయారు. శర్మ అక్క అక్కమ్మ కల్లూరు ప్రాథమిక పాఠశాలలో విద్యాభ్యాసం చేసేవారు. ఆమె పాఠశాలలో చెప్పిన పాఠాలు, అంకెలు, గణిత సూత్రాలు సంజీవరాయశర్మకు చెప్పడంతో శర్మ గుర్తుపెట్టుకుని పునశ్చరణ చేశారు. ఎవ్వరివద్ద చదువుకోకుండానే గణితంలో తనకంటూ తెలియని విషయాలు ఏవీలేవంటూ విమర్శకులను మెప్పించారు. గణితంలో పేరు ప్రఖ్యాతులు పొందుతున్న సమయంలోనే కల్లూరులోని లక్ష్మీనరసయ్య దగ్గర ఆయన వయోలిన్ నేర్చుకున్నారు.

ఆరువేలకు పైగా గణితావధానాలు

1928లో సంజీవరాయశర్మ తొలి గణితావధాన ప్రదర్శన ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, బీహార్, ఢిల్లీ, తదితర రాష్ట్రాల్లో విస్తృతంగా పర్యటించి దాదాపు 6వేల దాకా ప్రదర్శనలు ఇచ్చి అందరి మన్ననలను పొందారు. అనేక విశ్వవిద్యాలయాలు ఆయనను సత్కరించాయి. 14 బంగారు పతకాలు ఆయనను వరించాయి.

హ్యూమన్ కంప్యూటర్ శకుంతలాదేవిచే ప్రశంసలు

1958 జనవరి 21న బెంగళూరు ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలో శర్మ గణిత అవధాన ప్రదర్శన ఇచ్చారు. ఈ సదస్సులో హ్యూమన్ కంప్యూటర్‌గా పేరుగాంచిన శకుంతలా దేవి శర్మకు పరిచయం ఏర్పడింది. ఆయన మేధా సంపత్తిని, గణిత శాస్త్ర ప్రావీణ్యాన్ని, ప్రతిభను చూసి ఆమె ఆశ్చర్యచకితురాలయ్యారు. ''శర్మ నా కంటే గొప్పవారు, తేదీ ఇస్తే దానికి నేను వారం మాత్రమే చెప్పగలను.. శర్మ తెలుగు సంవత్సరం, నెల, నక్షత్రం, తిథి, రాశి తదితర వివరాలన్నీ చెబుతారు ఇది సామాన్యమైన విషయం కాదు'' అని శకుంతల ఆయన గొప్పతనాన్ని కొనియాడటం విశేషం.

ఇంగ్లండులో విగ్రహం పెట్టేవారు..

సంజీవరాయశర్మ తొలిసారిగా 1928లో నంద్యాలలో గణితావధానం చేశారు. 1928 నవంబర్ 15న నంద్యాలలో అఖిలభారత కాంగ్రెస్ మహాసభలు జరిగాయి. ఈ సభలో శర్మ నిర్వహించిన గణితావధానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 1961 జనవరి 16న ముద్దనూరులో యామవరం రోశిరెడ్డి నాయకత్వంలో శర్మ గణితావధానం చేశారు. ఈ ప్రదర్శన తిలకించిన పండితులు, శాస్త్రవేత్తలు, ప్రజలు ఆనందభరితులై అప్పటికప్పుడు అందరు డబ్బు సేకరించి ఆయనకు బంగారు పతకం, కొంత నగదు అందజేసి సత్కరించారు. ఇదే ఆయనకు లభించిన మొదటి బంగారు పతకం. 1931 జులై 21న ఆంధ్ర మహాసభ భవనంలో స్వాతంత్య్ర సమరయోధుడు నాగేశ్వరరావు అధ్యక్షతన సంజీవరాయశర్మ గణితావధానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆనాటి మద్రాసు గవర్నర్ సర్‌జార్జి స్టాన్లే అవధానం తిలకించి ఆశ్చర్యచికితులై శర్మతో కరచాలనం చేశారు. శర్మ ఇంగ్లాడులో పుట్టి ఉంటే ఆయన విగ్రహాన్ని లండన్ నడిబొడ్డున ఏర్పాటు చేసి దేశాధ్యక్షుని చేత ఆవిష్కరించి గౌరవించేవాళ్లమని కొనియాడారు.


కల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సంజీవరాయశర్మ విగ్రహం

4వేల సంవత్సరాల క్యాలెండరు తయారీ

1953లో 4000 సంవత్సరాలకు సరిపోయే క్యాలెండరును తయారు చేసి ఆనాటి భారత రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్‌కు పంపారు. రాష్ట్రపతి ప్రశంసిస్తూ ''నెల చివరి రోజులు కనుక నా జీతంలో మిగిలిన మొత్తం రూ.875 పంపిస్తున్నానని, ఎక్కువ సొమ్ము పంపలేక పోయానని'' సందేశం పంపి సంజీవరాయశర్మ గొప్పతనాన్ని కొనియాడారు.

నెహ్రూ ఎదుట గణితావధానం

1959లో ఢిల్లీలో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షతన జరిగిన గణితావధానంలో రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్, న్యాయమూర్తి పీవీ రాజమన్నార్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బెజవాడ గోపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సభలో నెహ్రూ 7 నిలువు వరుసలు, 7 అడ్డ వరుసలు ఉన్న చదరంగంలో 238 అంకెలు ఎటుకూడినా వచ్చేవిధంగా అంకెలు వేయమనగా శర్మ అంకెలు చెప్పి సభికులను ఆశ్చర్యానికి గురి చేశారు.

విజ్ఞానాన్ని దొంగిలించలేరు

1964లో రేణిగుంట నుంచి తిరుపతికి శర్మ రైలు ప్రయాణం చేస్తుండగా ఎవరో దొంగ ఆయన కోటుకు ఉన్న 14 బంగారు పతకాలను దొంగిలించారు. ''నా పతకాలు దొంగిలిస్తే దొంగిలించారు కానీ. నా విజ్ఞానాన్ని ఎవరూ దొంగిలించలేరని'' ఆయన బాధపడకుండా చెప్పారు.

డాక్టరేట్ ప్రదానం

ఈయన ప్రతిభను గుర్తించిన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం 1993లో డాక్టరేట్‌ను ప్రదానం చేసి గౌరవించింది. అలాగే గణిత బ్రహ్మ, అంకవిద్యాసాగర, విశ్వసాంఖ్యాచార్య బిరుదులు ఉన్నాయి. 1968 నుంచి 1993 వరకు కాళహస్తీశ్వరస్వామి ఆలయంలో ఆయన ఫిడేలు వాయిస్తూ జీవనం సాగించారు. 1994లో జనవరి 5న భార్య ఆదిలక్షుమ్మ చనిపోవడంతో కుమారుడు సుబ్బారాయుడు వద్దకు చేరారు. డిసెంబర్ 2న హైదరాబాదులో ఈయన పరమపదించారు. ఈయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.


లక్కోజు సంజీవరాయశర్మ (ఫైల్)

విగ్రహం ఏర్పాటు..

కల్లూరులోని జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ప్రతి ఏడాది నవంబరు 22న లక్కోజు సంజీవరాయశర్మ జయంతి వేడుకలను నిర్వహించి గణిత ప్రతిభా పరీక్షలో గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తున్నారు. పాఠశాలలో 1989–90లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శర్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసి సంజీవరాయశర్మ ప్రాంగణం అని పేరు పెట్టారు. 2019లో డిసెంబర్–2న సంజీవరాయశర్మ వర్ధంతి సందర్భంగా శర్మ విగ్రహాన్ని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆవిష్కరించారు.

గ్రామానికి గర్వకారణం



సంజీవరాయశర్మ మా గ్రామంలో జన్మించడం మాకు గర్వకారణం. గణిత బ్రహ్మగా పేరుగాంచిన ఆయన గ్రామానికి ఖ్యాతి తెచ్చిపెట్టారు. 6వేలకు పైగా గణిత అవధానాలు చేసిన ఆయన గొప్పతనాన్ని ప్రజలందరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఎంతో కష్టతరమైన గణిత సమస్యలు క్షణాల్లో చెప్పేవారని శర్మ గొప్పతనాన్ని పెద్దలు చెబుతారు. అలాంటి వ్యక్తి అందరికి స్ఫూర్తిదాయకం.

– కల్లూరు నాగేంద్రారెడ్డి, మాజీ సర్పంచ్, కల్లూరు

జయంతి వేడుకలను నిర్వహిస్తున్నాం



గణిత బ్రహ్మ లక్కోజు సంజీవరాయశర్మ మహామేధావి. దేశనాయకులు, గణిత శాస్త్రజ్ఞులు, పండితులు శర్మ గణితావధానాన్ని ప్రశంసించారు. ఆ మహోన్నత వ్యక్తి మేధస్సు గురించి భావితరాలకు తెలియాలనే ఉద్దేశంతో ఆయన జయంతి నాడు విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నాం.

–కేవీ విజయమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయుడు

విత్తన కంపెనీ మోసం చేసిందంటూ రైతుల ఫిర్యాదు

పోరుమామిళ్ల : మొక్కజొన్న విత్తనాలు ఇచ్చిన కంపెనీ ప్రతినిధులు తమకు డబ్బు ఇవ్వకుండా మోసం చేశారని మండలంలోని దమ్మన్నపల్లె, సుంకేసులపల్లె గ్రామాలకు చెందిన రైతులు ఆరోపిస్తున్నారు. ఆదివారం దమ్మన్నపల్లెకు చెందిన కోనేటి నరసింహులుతో పాటు మరో 20 మంది రైతుల సంతకాలతో వసుధ బయోటెక్ కంపెనీ ప్రతినిధులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైతుల కథనం మేరకు.. కంపెనీ ఆర్గనైజర్ ఓబులేసు 110 ఎకరాలకు విత్తనాలు ఇవ్వడంతో 110 ఎకరాలు సాగు చేశామన్నారు. 66 ఎకరాల్లో పంట బాగా రాలేదని చెప్పగా దాన్ని దున్ని వేశామన్నారు. మిగతా 44 ఎకరాల్లో పంట సాగు చేశామని, కోతలయ్యాక పంటను కాటా వేసుకొని తీసుకెళ్లారన్నారు. 20 రోజుల్లో డబ్బు ఇస్తామని రెండు నెలలవుతున్నా డబ్బు ఇవ్వలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎకరాకు రూ.55 వేలు ఇస్తామని హామీ ఇవ్వడంతో 40 మంది రైతులం 50 ఎకరాల్లో సాగు చేశామన్నారు.

రైతుల ఆరోపణలో వాస్తవం లేదు..

ఈ విషయమై కంపెనీ ప్రొడక్షన్ మేనేజర్ చంద్రమౌళిని విచారించగా రైతులు చెప్పేదాంట్లో వాస్తవం లేదన్నారు. వానల కారణంగా గడ్డి పెరిగి పొలంలో పంట దెబ్బతిందన్నారు. 38 ఎకరాల్లో ఓ మోస్తరుగా పంట ఉండగా అందులో 12 ఎకరాలు బాగా లేనందున దాన్ని కూడా దున్ని వేయమని చెప్పామన్నారు. మొదట మంచి పంట వస్తే ఎకరాకు రూ. 55 వేలు ఇస్తామని చెప్పామని, అయితే వానల కారణంగా గడ్డి పెరిగి దిగుబడి బాగా రాలేదన్నారు. రూ. 1.70 లక్షల విలువచేసే రసాయన మందులు కూడా రైతులకు ఇచ్చామన్నారు. కోతలయ్యాక విత్తనాలు నాణ్యతగా లేవన్నారు. 26 ఎకరాల్లో వచ్చిన పంటను తీసుకున్నామని, వాటికి ఎకరాకు రూ. 30 వేల వంతున ఇస్తామని చెప్పగా అంగీకరించారన్నారు. కానీ ఇప్పుడు 40 ఎకరాలకు రూ. 55 వేలు వంతున ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. విత్తనాలు తీసుకునే సమయంలో రైతులు అంగీకరించిన డబ్బు ఇచ్చేందుకు కంపెనీ సిద్ధమని, ఇప్పుడు అన్యాయంగా వారు కోరే డబ్బు కంపెనీ ఎలా ఇవ్వగలదని చంద్రమౌళి ప్రశ్నించారు.


పోలీస్ స్టేషన్ దగ్గర దమ్మన్నపల్లె రైతులు

మహా విష్ణువుకు ఇష్టం.. మార్గశిర మాసం

నేటి నుంచి ప్రారంభం

కడప కల్చరల్ : మార్గశిరం.. మహా విష్ణువుకు అత్యంత ఇష్టమైన మాసం. వైష్ణవులకు ముక్తిదాయకమైన మాసం.. వరుస పర్వదినాలతో అధిక పుణ్యం సంపాదించుకునే మార్గం.. మార్గశిరమాసం.. ఈ మాసం, ఈ సందర్భంగా వచ్చే పర్వదినాలు, నిర్వహించే పూజల గురించిన వివరాలు..

అన్ని మాసాలలో మార్గశిరం తనకెంతో ఇష్టమైనదని మహావిష్ణువు స్వయంగా చెప్పినట్లు పౌరాణికులు చెబుతుంటారు. ఇతర మాసాలన్నింటికంటే ఈ మాసం వైష్ణవులకు అత్యంత పుణ్యదాయకమని భక్తులు భావిస్తారు. ఈ మాసంలో వచ్చే పలు పర్వదినాల్లో చేసే పూజలు తమకెంతో పుణ్యాన్ని ఇస్తాయన్నది వారి విశ్వాసం.

కార్తీక మాసపు అమావాస్య తర్వాతి రోజు సోమవారం నుంచి మార్గశిర మాసం ప్రారంభం కానుంది. ఇది హేమంతంలో వచ్చే మొదటి నెల. సౌరమానం ప్రకారం ధనుర్మాసం, చంద్రమానం ప్రకారం మార్గశిర మాసం వస్తాయి. ఈ మాసంలో భక్తులు ఎక్కువ సమయం ఆధ్యాత్మిక చింతనతో గడుపుతారు. ప్రకృతి కూడా మనోహరంగా కనువిందు చేస్తూ ఉంటుంది. మృగశిర నక్షత్రంతో కూడిన పౌర్ణమి వచ్చింది గనుక దీన్ని మార్గశిరమాసమని పేర్కొంటారు. ఈ మాసంలో ఏ పూజచేసినా అధిక పుణ్యం లభిస్తుందని పెద్దలు పేర్కొంటారు.


విశేష అలంకారంలోస్వామి, అమ్మవార్లు

మార్గశిరంలో పర్వదినాలు

ఈ మాసంలో శివ పుత్రుడు సుబ్రమణ్యస్వామికి సంబంధించిన సుబ్రమణ్యషష్ఠి పండుగను ముఖ్యమైనదిగా భావిస్తారు. ఈ మాసంలో వచ్చే శుద్ధ షష్ఠిని సుబ్రమణ్యషష్ఠిగా కుమారస్వామికి పూజలు నిర్వహిస్తారు. ఫలితంగా యోగా, ఆరోగ్యబలం చేకూరుతాయని భక్తుల్లో విశ్వాసం ఉంది. శుక్లపక్ష సప్తమి నాడు లోకమిత్రుడు, ప్రత్యక్ష నారాయణుని ముఖ్యమైన రోజుగా భావిస్తారు. ఆరోజున దినకరుని పూజ ఆరోగ్యాన్ని ఇస్తుందని విశ్వసిస్తారు. మార్గశిర శుక్లపక్ష ఏకాదశి నాడు గీతా జయంతి వస్తుంది. ఈ సందర్భంగా విశ్వమానవాళికి ఉత్తమ మార్గదర్శనం చేసే జ్ఞాన గ్రంథం భగవద్గీత పారాయణం పుణ్యదాయకమని పేర్కొంటారు. శుక్ల ద్వాదశి నాడు మహా విష్ణువుకు సంబంధించిన వ్రతాలు, త్రయోదశి నాడు అంజనీపుత్రుడు హనుమంతుని పేరిట వ్రతాలు నిర్వహిస్తారు. ఈ పూజల ద్వారా దుష్ట గ్రహాల నుంచి వచ్చే బాధలు తొలగిపోతాయన్న నమ్మకం ఉంది. ఈ మాసంలోనే సూర్యుడు ధనూరాశిలో ప్రవేశించడంతో ధనుస్సంక్రమణ పుణ్యకాలం ఆరంభమవుతుంది. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించినంత వరకు ధనుర్మాసం ఉంటుంది. ఈ నెలలో కాలభైరవాష్టమి కూడా వస్తుంది. ఆరోజున నిర్వహించే పూజలు ఆరోగ్యదాయకమంటారు. మార్గశిర శుద్ధ పౌర్ణమినాడు దత్తాత్రేయ జయంతి నిర్వహిస్తారు.

కువైట్‌లో గుండెపోటుతో వ్యక్తి మృతి

సుండుపల్లి : మండల పరిధిలోని జి.రెడ్డివారిపల్లి గ్రామ పంచాయతీ, కోనంకివారిపల్లి హరిజనవాడకు చెందిన బండి వినోద్ కుమార్ (30) కువైట్‌లో గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బండి వినోద్ కుమార్‌కు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. బతుకు దెరువుకోసం కువైట్‌కు వెళ్లి రెండేళ్లైంది. ఈ నెలలో స్వగ్రామానికి రావాల్సి ఉంది. ఇంతలోనే శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడని మృతుని బంధువులు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులకు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి

ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు 30 శాతం మధ్యంతర భృతి తక్షణమే చెల్లించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, ఏపీ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీయపురెడ్డి వెంకట జనార్దన రెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని సీపీఎస్ ఉద్యోగులకు గత ఐదేళ్లుగా డీఏ బకాయిల జమ జరగలేదని తెలిపారు. వెంటనే ఉద్యోగుల ఖాతాకు జమ చేయాలన్నారు. ప్రభుత్వం పీఆర్సీ కమిటీ వేగవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఇందుకు సంబంధించిన నివేదికను సత్వరం తెప్పించుకొని అమలు చేయాలని, ఉద్యోగులకు చెల్లించాల్సిన అన్ని బకాయిలను తక్షణమే చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

హామీలు అమలు చేయలేక తప్పుడు ప్రచారం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : ఎన్నికల ముందు ఎన్‌డీఏ కూటమి ఇచ్చిన హామీలు అమలు చేయలేక వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఏదో తప్పు జరిగిపోయిందంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే 30 శాతం విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే హామీలను పక్కన పెట్టి ప్రజలపై రూ.7900 కోట్ల భారం మోపారన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ప్రజలు నవంబర్ 26వతేదీ నుంచి రెండు సంవత్సరాల పాటు ప్రతి యూనిట్‌కు 92 పైసలు అదనంగా చెల్లించాల్సి వస్తుందన్నారు. అయితే గత ప్రభుత్వం తప్పిదం వల్లే ఇలా జరిగిందంటూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. 2014–19 సంవత్సరంలో చంద్రబాబు నాయుడు డిస్కంలకు 48వేల కోట్ల రూపాయలు అప్పు పెడితే దానిని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చెల్లించిందన్నారు. రైతులకు ఉచిత కరెంటు అందించాలనే లక్ష్యంతో గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి టెండర్లు పిలిచిందన్నారు. దానికి న్యాయపరమైన చిక్కులు రావడంతో కేంద్ర ప్రభుత్వం సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా (సెక్కి) సోలార్ పవర్ యూనిట్‌కు రూ.2.49 పైసలకు ఇస్తామంటూ ఉత్తరం రాసిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం రూ.5.90 పైసలు పెట్టి కొనుగోలు చేస్తే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం రూ.2.49 పైసలకే కొనుగోలు చేసిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తక్కువ ధరకు కరెంటు కొనుగోలు చేస్తే లక్షల కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు చిల్లులు పడ్డాయని ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు రాయడం దారుణమన్నారు. ఎన్‌డీఏ కూటమిపై ఇప్పటికే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


మృతి చెందిన వసంత కుమార్

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు పట్టణం ఎస్పీజీ క్వార్టర్స్‌కు చెందిన మీసా వసంత కుమార్ (27) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వసంత కుమార్ ఆదివారం అర్ధరాత్రి తన బుల్లెట్ బైక్ తీసుకొని బయటకు వెళ్లాడు. తరువాత ఇంటికి రాలేదు. తెల్లవారుజామున పట్టణ పరిధిలోని శేషారెడ్డిపల్లె గ్రామానికి వెళ్లే రహదారిలో రైల్వేగేట్ సమీపంలో మృతి చెంది ఉన్నాడు. మృతుని ముఖంపై తీవ్ర గాయాలున్నాయి. బుల్లెట్ వాహనం బాగా దెబ్బతిని ఉంది. ఈ రహదారిలో బైకులు తప్ప ఇతర వాహనాలు తిరగవు. ఒక వేళ ప్రమాదం అయితే ఎలా జరిగిందనేది తెలియాల్సి ఉంది. మృతుడు ఈ రహదారిలో ఎందుకు వెళ్లాడో తెలియరాలేదు. వసంతకుమార్ కడప ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతనికి భార్య వసుంధర, ఒక కుమారుడు ఉన్నారు. ఈ విషయమై పట్టణ సీఐ ఎస్. లింగప్పను వివరణ కోరగా ప్రమాదవశాత్తు కింద పడి వసంత కుమార్ మృతి చెందాడని తెలిపారు.

గండికోటలో భద్రత డొల్ల!

- గుడారాల పేరుతో ఇష్టారాజ్యంగా దోపిడీ
- హైదరాబాద్‌కు చెందిన పర్యాటకుల వాహన అద్దం పగుల గొట్టిన దుండగులు
- పట్టించుకోని అధికారులు


గండికోట


గండికోటలో పగిలిపోయిన కారు అద్దాలు

జమ్మలమడుగు : పర్యాటక కేంద్రమైన గండికోటలో పర్యాటకులకు, వారి వాహనాలకు భద్రత కరువైంది. సుదూర ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాల్లో వస్తున్న పర్యాటకుల నుంచి టోల్‌గేట్ పేరిట డబ్బులు వసూలు చేస్తున్నా వాహనాలకు భద్రత లేకుండా పోయింది. శనివారం గండికోటలో హైదరాబాద్‌కు చెందిన పర్యాటకుల కారు అద్దాలు ధ్వంసం అయ్యాయి. ఏడాదిన్నర క్రితం ఏకంగా కారునే దొంగతనం చేశారు.

అధికారుల అనుమతులు లేకుండానే గుడారాలు..

గండికోట వెలుపల పెన్నానది వద్ద ప్రైవేట్ వ్యక్తులు అనధికారికంగా గుడారాలు వేసి పర్యాటకులకు మద్యం సరఫరా చేస్తున్నారు. దీంతో అసాంఘిక కార్యకలాపాలు సైతం పెరిగిపోయాయి. సెలవు రోజుల్లో, శని , ఆదివారాల్లో వివిధ రాష్ట్రాల నుంచి, జిల్లాల నుం గండికోటను సందర్శించేందుకు ప్రత్యేక వాహనాల్లో పర్యాటకులు వస్తున్నారు. సెలవు రోజుల్లో కనీసం మూడు వేల మంది వరకు గండికోట ప్రాంతాన్ని సందర్శిస్తారని అధికారులు అంచనా వేశారు. పర్యాటకులకు వసతులు లేకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులు గుడారాలు వేసి ఇష్టారాజ్యంగా డబ్బులు దోచుకుంటున్నారు. చాలా మంది అనధికారికంగా గుడారాలు వేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. గతంలో చాలా సార్లు గొడవలతో పాటు, దొంగతనాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. అయినా అధికారులు మాత్రం పర్యాటకుల భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

నామమాత్రంగా అవుట్ పోస్టు..

గండికోటలో పర్యాటకుల భద్రత కోసం పోలీసుల అవుట్ పోస్టును ప్రారంభించారు. అయితే అక్కడ పోలీసులు ఎవ్వరూ ఉండరు. అక్కడ ఏమైనా జరిగితే జమ్మలమడుగు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. పోలీసులు స్థానికంగా లేకపోవడంతో గండికోటలో అసాంఘిక కార్యకలాపాలు సైతం పెరిగిపోతున్నాయి. ఏడాదిన్నర క్రితం బెంగళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ప్రత్యేక వాహనంలో వచ్చి గండికోటను చూసేందుకు వెళ్లారు. తిరిగి వచ్చే సరికి కారు లేకపోవడంతో జమ్మలమడుగు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆధిపత్యం ప్రదర్శిస్తున్న గుడారాల యజమానులు..

పర్యాటకులకు తామే గుడారాలను వేయాలంటూ గ్రామస్తులు ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నారు. గతంలో ఎన్నోసార్లు గ్రామస్తులు గొడవలు పడ్డారు. పర్యాటకుల వాహనాలపై కూడా దాడులు చేస్తున్నారు. శనివారం హైదరాబాద్‌కు చెందిన పర్యాటకుల వాహనంపై గుడారాల యజమానులు దాడి చేసి కారు అద్దాలు పగుల గొట్టారు. దీంతో పర్యాటకులు సైతం భయపడే పరిస్థితి నెలకొంది.

పర్యాటకులకు భద్రత కల్పించాలి

గండికోటను చూసేందుకు సెలవు రోజుల్లో వేల మంది ఇతర రాష్ట్రాల నుంచి భారీగా వస్తున్నారు. ఇప్పుడిప్పుడు అభివృద్ధి జరుగుతున్న గండికోటలో పర్యాటకుల వాహనాలపై దాడులు చేయడం సరైంది కాదు. అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలి.

శివకుమార్, డీవైఎఫ్ఐ, జిల్లా నాయకుడు, జమ్మలమడుగు

పర్యాటకుల భద్రతకు చర్యలు తీసుకుంటాం

గండికోటలో పర్యాటకుల భద్రతకు చర్యలు తీసుకుంటాం. అవుట్ పోస్టులో పోలీసు సిబ్బందిని నియమిస్తాం. గుడారాలను వేసే వారిని పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తాం. అనధికారిక గుడారాలపై చర్యలు తీసుకుంటాం.

లింగప్ప, అర్బన్ సీఐ జమ్మలమడుగు